పేరుపాలెం బీచ్‌లో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరు పాలెం బీచ్ ఆదివారం పర్యాటకులతో కిటకిట లాడింది. దసరా సెలవులు కావడంతో పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక, ద్విచక్ర వాహనాలపై ఉదయమే బీచ్‌కు చేరుకున్నారు. సముద్ర స్నానాలు చేసి ఉల్లాసంగా గడిపారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సరివి, కొబ్బరి తోటల్లో సహపంక్తి భోజనాలు చేసి సేదతీరారు.

బీచ్‌లో స్నానాలు చేస్తున్న పర్యాటకులు

ధరల మంట..నాణ్యత చింత..!

భగ్గుమంటున్న కూరగాయల ధరలు

సొమ్ము వెచ్చిస్తున్నా దొరకని నాణ్యమైన సరుకులు

రైతుబజార్లలో నాణ్యత లేని కూరగాయలతో జనం అవస్థలు

ఏలూరు వన్‌టౌన్ రైతుబజార్‌లో పరిస్థితి మరింత అధ్వానం

కొరవడిన మార్కెటింగ్ శాఖ అధికారుల పర్యవేక్షణ



ఏలూరు వన్‌టౌన్ రైతుబజార్‌లో నాణ్యతలేని ఉల్లిపాయలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మార్కెట్లో కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. ముఖ్యమైన కూరగాయల ధరలు కిలో రూ.50 నుంచి రూ.70 వరకూ పలుకుతున్నాయి. నలుగురు కుటుంబ సభ్యులు ఉన్నవారు వారానికి సరిపడా కూరగాయలు కొనుగోలు చేయాలంటే గతంలో ఎన్నడూ లేనివిధంగా కనీసం రూ.800 నుంచి రూ.వెయ్యి వెచ్చించాల్సిన పరిస్థితి. దీంతో నెలకు రూ.నాలుగు వేలు కూరగాయల కొనుగోలుకే చేయాల్సిన దుస్థితి దాపురించింది. దీంతో సామాన్య ప్రజానీకం కూరగాయలు కొనుగోలు చేయాలంటేనే భయపడుతున్న పరిస్థితి. ఉల్లి నుంచి టమోటా వరకూ అన్ని కూరగాయల ధరలు భారీగా పెరగడంతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధిక ధరలు చెల్లించి కొనుగోలు చేస్తున్న కూరగాయలు సరైన నాణ్యత లేకపోవడంతో జనానికి ఏం చేయాలో అర్థంకాక సతమతమవుతున్నారు. బహిరంగ మార్కెట్లతోపాటు ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే రైతుబజార్లలోనూ నాణ్యత లేని కూరగాయలు విక్రయిస్తుండటంపై వినియోగదారులు తీవ్ర ఆవేదనకు గురవు తున్నారు. కూరగాయల ధరలు ఆకాశాన్నంటడంతో ఎంతోకొంత ధర తక్కువతోపాటు, నాణ్యమైన సరుకు దొరుకుతుందని జనం ఆశగా రైతుబజార్లకు వెళ్తున్నారు. అక్కడ నాణ్యత లేని కూరగాయలు చూసి జనం నోరెళ్లబెడుతున్నారు. ఏలూరు నగరంతోపాటు అనేక పట్టణాల్లో రైతుబజార్లు కొనసాగుతున్నాయి. ఏలూరు వన్‌టౌన్‌లో ఒకటి, టుటౌన్‌లోని పత్తేబాద్‌లో మరొక రైతుబజార్ ఉన్నాయి. నగరవాసులంతా ఎక్కువగా ఈ రైతుబజార్లలోనే కూరగాయలు కొనుగోలు చేస్తున్న పరిస్థితి ఉంది. వన్‌టౌన్ రైతుబజార్‌లో కూరగాయల నాణ్యత అనేది అత్యంత దారుణంగా ఉంటుందని వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. కిలో ఉల్లిపాయలు రూ.56 వసూలు చేస్తున్నా కనీస నాణ్యత లేకపోవడం గమనార్హం. కిలో ఉల్లి మంచివి తీసుకోవాలంటే ఏరుకోవడానికి కనీసం అరగంట సమయం పడుతోంది. వినియోగదారులంతా ఆదివారం రైతుబజార్లకు ఎక్కువగా వస్తుంటారు. తాజా, నాణ్యమైన కూరగాయలు దొరుకుతాయని జనం ఆశిస్తారు. వన్‌టౌన్ రైతుబజార్‌లో ఆదివారం సైతం నాణ్యమైన, తాజా కూరగాయలు దొరకని పరిస్థితి నెలకొంది. అదేమని అడిగితే సరైన సమాధానం చెప్పని పరిస్థితి. కూరగాయలు వడలిపోయి, నాణ్యత లేకుండా ఉండటంతో జనం ఈ రైతుబజార్‌లో కూరగాయలు కొనుగోలు చేసేందుకు విముఖత చూపుతున్నారు. ఇక్కడ ఎస్టేట్ ఆఫీసర్ ఉన్నప్పటికీ సరైన పర్యవేక్షణ లేకుండా పోయిందనే అభిప్రాయం జనాల్లో వ్యక్తమవుతోంది. ఉల్లి, టమోటా, క్యారెట్, బెండ ఇలా ఏఒక్క కూరగాయ నాణ్యత లేని పరిస్థితి. పత్తేబాద్ రైతుబజార్‌లో కొంతమెరుగ్గా ఉన్నప్పటికీ నాణ్యమైన కూరగాయలు విక్రయించేలా చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

ఆదివారం రైతుబజార్‌లో కూరగాయల ధరలు ఇలా..

కూరగాయలు	ధర (కిలో)
అల్లం	150
టమోటా	74
కాప్సికం	70
వంకాయ	54
ఉల్లి	56
క్యారెట్	58
కాకర	50
దొండకాయ	60
చేమదుంప	48
బీర	54
దోస	40
బంగాళ దుంప	40
గోరుచిక్కుళ్లు	44
ఆనబకాయ ఒకటి	50
పొట్లకాయ ఒకటి	25
బెండకాయలు	38
పచ్చిమిర్చి	32

ధరల మంటతో విలవిల

కూరగాయల ధరలు పెరుగుతున్న తీరు జనాల్ని హడలెత్తిస్తోంది. తాము అధికారంలోకి వస్తే ధరలను అదుపు చేస్తామంటూ చెప్పిన కూటమి ప్రభుత్వం పూర్తిగా చేతులెత్తేసింది. కిలో ఉల్లి ధర బహిరంగ మార్కెట్లో రూ.60 వరకూ పలుకుతోంది. నలుగురు సభ్యులున్న కుటుంబానికి తక్కువగా లెక్కించినా వారానికి రెండు కిలోలు అవసరం పడతాయి. ఉల్లిపాయల కోసం వారానికి ఏకంగా రూ.120 ఖర్చు పెట్టాల్సి వస్తోంది. గతంలో ధరలు పెరిగినప్పుడు సబ్సిడీపై ఉల్లిపాయలను ప్రభుత్వం అందించేది. ఇప్పుడు అటువంటి పరిస్థితి సైతం లేకుండాపోయింది. కిలో కూరగాయలు కొనుగోలు చేసేవారు ధరల పెరుగుదలతో అరకిలోతో సరిపెట్టుకుంటున్నారు. దీంతో పోషకాహార లోపం ఏర్పడి అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. నిమ్మకాయల ధరలు సైతం రైతు వద్ద కొనుగోలు చేస్తున్న ధరకు, వినియోగదారుడికి విక్రయిస్తున్న ధరకు సంబంధం లేకుండా పోయింది. ఏదేమైనా ఒకపక్క ధరల మంట, మరోపక్క నాణ్యతలేని కూరగాయలతో జనం విలవిల్లాడుతున్నారు.

రాకెట్ నమూనాను పరిశీలిస్తున్న కలెక్టర్ సి.నాగరాణి

అంతరిక్ష పరిశోధనా ఫలితాలపై అవగాహన అవసరం

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భారతదేశ అంతరిక్ష కార్యక్రమం కేవలం రాకెట్లు, ఉపగ్రహాల గురించి మాత్రమే కాదని, వాస్తవ ప్రపంచ సమస్యలను పరిష్కరించడం ద్వారా భవిష్యత్ తరాలు స్థిరమైన, సురక్షితమైన, పూర్తి అవకాశాలతో కూడిన ప్రపంచాన్ని వారసత్వంగా పొందేలా చేయడమని, దీనిపై అందరికీ అవగాహన అవసరమని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ఆదివారం స్థానిక బివి రాజు పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు-2024 ప్రారంభ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ఇది సమాజానికి అంతరిక్ష శాస్త్రం, సాంకేతిక పరిజ్ఞానం అపారమైన సహకారాన్ని ప్రదర్శించడానికి ఏర్పాటు చేసిన కార్యక్రమమన్నారు. 2024లో ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలను 'స్పేస్ అండ్ క్లయిమేట్ చేంజ్' థీమ్‌తో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతరిక్ష సాంకేతికతలు, విశ్వం గురించి మన అవగాహనను విస్తరింపజేయడం దీని ప్రధాన ఉద్దేశమన్నారు. ఇస్రో సాధించిన అత్యద్భుతమైన అంతరిక్ష పరిశోధన ఫలితాల గురించి అవగాహన పెంచుకొని, విద్యార్థులు, యువత అంతరిక్ష సాంకేతికతపై మక్కువ చూపాలన్నారు. వాతావరణ సూచనలకు సహాయపడే ఉపగ్రహాలను ప్రయోగించడం నుండి చంద్రుడు, అంగారక గ్రహాలకు మిషన్లను పంపడం వరకు ఇస్రో కార్యకలాపాలు విస్తరించాయని, అలానే మనం జీవించే విధానాన్ని, మనం గ్రహాన్ని అర్థం చేసుకునే విధానాన్ని ఇస్రో పరిశోధనలు మార్చాయన్నారు. భూమి పరిశీలనలో ఇన్‌శాట్, జిశాట్, కార్టోశాట్ వంటి ఉపగ్రహాలు విలువైన డేటాను అందిస్తున్నాయన్నారు. ఇవి వాతావరణ నమూనాలను పర్యవేక్షించడంలో, ప్రకృతి వైపరీత్యాలను ట్రాక్ చేయడంలో, నీటి వనరులను నిర్వహించడంలో మనకు సహాయపడతాయన్నారు. సముద్ర మట్టాలు పెరగడం, హిమానీనదాలు కరిగిపోవడం వంటి వాతావరణ మార్పుల ప్రభావాలను అధ్యయనం చేయడంలో కూడా ఈ డేటా కీలకంగా ఉంటుందన్నారు. చంద్రయాన్, మంగళయాన్ మిషన్లు చంద్రుడు, అంగారక గ్రహాలను అన్వేషించడమే కాకుండా సంక్లిష్ట అంతరిక్ష లక్ష్యాలను సాధించడంలో భారతదేశ సామర్థ్యాన్ని కూడా ప్రదర్శించాయన్నారు. ప్రపంచం వాతావరణంలో మార్పులు మానవాళిని భయపెడుతున్నాయని, వీటిని సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ఉపగ్రహాల పరిశోధనలు చాలా ముఖ్యమైనవని అన్నారు. సరాల్ ఉపగ్రహం సీఎన్ఈఎస్(ఫ్రెంచ్ అంతరిక్ష సంస్థ) భాగస్వామ్యంతో అభివద్ధి చేయబడిందన్నారు. ప్రపంచానికి ముఖ్యమైన సూచిక అయిన సముద్ర ఉపరితల ఎత్తులను పర్యవేక్షించడంలో ఇది సహాయపడుతుందన్నారు. అంతరిక్ష సాంకేతికత కేవలం శాస్త్రవేత్తలు, ఇంజినీర్లకు మాత్రమే కాదని, ఇది ఉత్సుకత, అభిరుచి, మార్పు చేయాలనే కోరిక ఉన్న ఎవరికైనా ఉపయోగపడుతుందని అన్నారు. వీటిని విద్యార్థులు, యువత అందిపుచ్చుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. గ్రహం దాటి పెద్దగా కలలు కనాలని, కష్టపడి పనిచేయాలన్నారు. శ్రీహరికోట షార్ సెంటర్ విఎఎల్ఎఫ్ డిప్యూటీ డైరెక్టర్ టిఎస్.రఘురాం మాట్లాడుతూ ఇస్రో సాధించిన విజయాల పట్ల మనం గర్విద్దాం అని, అంతరిక్ష సాంకేతికత ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించడానికి కలిసి పని చేద్దామని అన్నారు. అంతరిక్షానికి అవధి లేదని, అపారమైన సంపద అంతరిక్షంలో దాగి ఉందని అన్నారు. మన ఆంధ్రప్రదేశ్ లోనే స్పేస్ సెంటర్ ఉండడం ఒక అవకాశం గా ఉందన్నారు. సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) శ్రీహరికోట, భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనను విద్యార్థులు, ప్రజలందరూ వినియోగించుకోవాలని కోరారు. కలెక్టర్ స్పేస్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ప్రయోగాల నమూనాలను ఆమె తిలకించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో షార్ ఎస్‌డిఎస్‌సి జనరల్ మేనేజర్ పి.ఏడుకొండలు, విష్ణు కాలేజీ స్కూల్ ప్రిన్సిపల్ బిందు, శ్రీహరికోట ఇస్రో శాస్త్రవేత్తలు, భీమవరం పట్టణం పరిసర ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థల విద్యార్థులు, ప్రజలు, విష్ణు కాలేజీ ప్రతినిధులు పాల్గొన్నారు.

అనధికారిక ఇసుక అమ్మకాలను ఉపేక్షించం

కలెక్టర్ సి.నాగరాణి

ఎస్‌పి అద్నాన్ నయీంఅస్మి



మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో అనధికారిక ఇసుక అమ్మకాలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి హెచ్చరించారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్‌లోని వశిష్ట సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కలెక్టర్‌తోపాటు ఎస్‌పి అద్నాన్ నయీంఅస్మి సంయుక్తంగా ఉచిత ఇసుకపై మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో ఇసుక అందుబాటులో లేదన్నారు. జిల్లాలో ఐదు డీజిల్టేషన్ పాయింట్లులో మూడు లక్షల టన్నులు, ఆరు ఓపెన్ రీచ్‌ల్లో 4.20 లక్షల టన్నులు ఇసుక సిఆర్‌జెడ్ పరిధిలో ఉండడంతో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆంక్షలు ఉన్నాయని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశామని, అనుమతులు వస్తే జిల్లాలో ఇసుక అందుబాటులోకి వస్తుందని వివరించారు. ఈ నెల 16 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 108 ఓపెన్ రీచ్‌లు, 28 డీసిల్టేషన్ పాయింట్లు, 48 సెమీ డీసిల్టేషన్ పాయింట్లు అందుబాటులోకి వస్తాయని, ఉచిత ఇసుక పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటుందని స్పష్టం చేశారు. జిల్లాలో అవసరమైన లబ్ధిదారులు ఇసుకను పొందుటకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏమైనా సాంకేతిక సమస్యలు ఎదురైతే పరిష్కరించడానికి జిల్లా కలెక్టరేట్‌లో ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఆరుగురు టెక్నికల్ సిబ్బందితో ఏర్పాటు చేసి అందుబాటులో ఉంచామన్నారు. 9391445753, 8688291997, 8186939223, 9550175144 నెంబర్లకు ఫోన్ చేసి ఆన్‌లైన్ బుకింగ్‌కు టెక్నికల్ సమస్యలు ఎదురైతే వారి ద్వారా పరిష్కరించుకోవచ్చని సూచించారు. ఇసుక పూర్తిగా ఉచితమని, నిర్వహణా ఛార్జీలు, రవాణా ఛార్జీలు మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. 10 టైర్ లారీ ద్వారా 18 టన్నులు, 20 టన్నుల ఇసుకను పొరుగు జిల్లాల నుండి పొందుటకు రూ.13,660 మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని, అంత మించి ఎవరైనా వసూలు చేస్తే ఫెసిలిటేషన్ సెంటర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. గతంలోని ధరతో పోలిస్తే సగం ధరకే ఉచిత ఇసుక లభిస్తుందన్నారు. జిల్లాలో ఎట్టి పరిస్థితుల్లో అనధికార ఇసుక అమ్మకాలు జరగడానికి వీల్లేదని, దీనిపై రెవెన్యూ, పోలీస్ అధికారులు గట్టి చర్యలను చేపట్టాలన్నారు. వేరే జిల్లాల నుండి ఇసుక తీసుకువచ్చి కొన్ని ప్రాంతాల్లో డంప్ చేసి అధిక మొత్తానికి విక్రయిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, ఇటువంటి వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణా చేసినా, ప్రయివేటు వ్యక్తులు ప్రవేశించినా, ఇసుకను అధిక ధరకు అమ్మినా తక్షణ కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జాయింట్ కలెక్టరు టి.రాహుల్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వినియోగదారులు ఇసుక ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న తర్వాత వారికి సక్రమంగా ఇంటికి చేరేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఉచిత ఇసుక సరఫరాపై సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. సమావేశంలో డిఆర్‌ఒ జె.ఉదయ భాస్కరరావు, జిల్లా ఎఎస్‌పి వి.భీమారావు, జిల్లా గనులు, భూగర్భ శాఖ సహాయ సంచాలకులు డి.రవి ప్రసాద్, ఇడిఎం ఎం.కిరణ్‌కుమార్, సూపరింటెండెంట్ హెచ్.గౌస్‌ముద్దీన్, జిల్లా కలెక్టరేట్ కోఆర్డినేషన్ సూపరింటెండెంట్ ఎం.సన్యాసిరావు పాల్గొన్నారు.

రేపు శాంసంగ్ బ్రాంచీల ముందు నిరసన

సిఐటియు జిల్లా కమిటీ పిలుపు

ప్రజాశక్తి - భీమవరం

శాంసంగ్ కంపెనీలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. తమిళనాడులోని శాంసంగ్ కంపెనీ కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా మొండిగా వ్యవహరిస్తున్న యాజమాన్యం వైఖరికి నిరసనగా ఈ నెల 8న నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జెఎఎన్‌వి.గోపాలన్, కె.రాజారామ్మోహన్‌రాయ్ తెలిపారు. కంపెనీలో 1800 మంది కార్మికులు ఉంటే 1450 మంది కార్మికులు సిఐటియులో ఉన్నారని, అయితే కంపెనీ యాజమాన్యం యూనియన్‌ను గుర్తించకుండా, కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా మొండిగా వ్యవహరిస్తుందని విమర్శించారు. దీనికి నిరసనగా సిఐటియు అఖిల భారత కమిటీ పిలుపులో భాగంగా ఈ నెల 8వ తేదీన జిల్లాలోని అన్ని శాంసంగ్ కంపెనీ బ్రాంచీల వద్ద నిరసన తెలుపుతామని పేర్కొన్నారు.

ఉచిత ఇసుక ఇవ్వాలని సిపిఎం ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - నరసాపురం

రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ అమలు చేయాలని, ఇసుక దోపిడీని అరికట్టాలని సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక పాత బజార్ సెంటర్లో నిర్మాణ రంగ కార్మికులు నిరసన తెలిపారు. నిర్వహిం చారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కవురు పెద్దిరాజు, పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇసుకను అక్రమమార్గంలో వ్యాపారం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇసుకను ఉచితంగా అందజేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి వంద రోజులు కావస్తున్నా ఉచిత ఇసుక అమలు చేయకపోవడం దారుణమన్నారు. ఆన్‌లైన్ పద్ధతి వల్ల సామాన్యులు ఇసుకను పొందే అవకాశం లేకుండా పోతుందన్నారు. పాత పద్ధతిలోనే ర్యాంపులు తీసుకొచ్చి, ర్యాంపు వద్దే లబ్ధిదారులకు ఉచితంగా ఇసు కను అందజేసే కార్యక్రమం చేపట్టాలన్నారు. తక్షణం ఇసుకను అందుబాటులోకి తీసుకొచ్చి నిర్మాణరంగ కార్మికులను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ రంగం యూనియన్ ప్రెసిడెంట్ పోతినీడి రామకృష్ణ, అడబాల ప్రకాష్, దివి శ్రీనివాస్, సిపిఎం నాయకులు పొగాకు నారాయణరావు, మంచిలి నీలకంఠం, పున్నమి అప్పలనాయుడు, కోరాడ బద్రి, పొన్నాడ మల్లేష్ పాల్గొన్నారు.

ధర్నాలో నినదిస్తున్న నేతలు, కార్మికులు

ఉరుములు, గాలులతో వర్షం

ప్రజాశక్తి - గణపవరం

మండలంలో ఆదివారం సాయంత్రం ఉరుములు, బలమైన ఈదురుగాలులతో వర్షం కురిసింది. మూడు రోజులుగా వేసవిని తలపించేలా ఎండలతో తీవ్ర ఇబ్బందులు పడిన ప్రజలు వర్షంతో సేదతీరారు. నాలుగు రోజులపాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటనతో వరి, ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు ఇప్పటికే రొయ్యలకు వైరస్ సోకి రైతులు నష్టపోయిన సంగతి తెలిసిందే. కోతలకు సిద్ధంగా ఉన్న వరిచేలు వర్షం వల్ల పడిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

21న కలెక్టరేట్ వద్ద చేతివృత్తిదారుల ధర్నా

ప్రజాశక్తి - ఆచంట

చేదోడు, తోడు, వాహనమిత్ర పథకాలను తిరిగి ప్రవేశపెట్టాలని కోరుతూ ఈ నెల 21వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టరేట్ వద్ద చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు అల్లాడి సూర్యభాస్కరరావు పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చేదోడు, తోడు, వాహన మిత్ర పథకాలను తిరిగి ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే ఈ ధర్నాలో నాయీ బ్రాహ్మణులు, రజకులు, ఆటో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

నో శాండ్.. కిక్కు మాత్రం రెడీ..!

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరి వంద రోజులు దాటింది. సమస్యల పరిష్కారం, సూపర్ సిక్స్ అమలుపై జనం అంతా ఆశగా ఎదురుచూస్తున్నారు. అయితే అధికారపక్ష నేతలు మాత్రం అధికారం చేతికొచ్చిన కిక్ అనుభవించాలనే ఆత్రుతలో ఉన్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం నుంచి చెబుతున్న అంశాలు తప్ప స్థానిక సమస్యలపై ప్రజాప్రతినిధుల మాటలు తప్ప చేతలు ఉండటం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు ఎంఎల్ఏలు మినహా మిగిలిన వారంతా తమ వారికి నామినేటెడ్ పదవుల కోసం, ఆదాయం ఆర్జనపైనే ఎక్కువ దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల ప్రజలు ఇసుక సమస్యతో సతమతమవుతున్నారు. ఉచిత ఇసుక అందితే తమ కష్టాలు గట్టెక్కుతాయని నిర్మాణదారులంతా ఆశగా ఎదురుచూడగా తమకు పనులు దొరుకుతాయని భవన నిర్మాణ రంగ కార్మికులంతా సంతోషించారు. అయితే ఆదిలోనే హంసపాదు అన్నట్లుగా ఉచిత ఇసుక కోసం ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకుందామంటేనే 'నో శాండ్' అని రావడంతో నిర్మాణదారులు కంగుతిన్నారు. ఇప్పటికే ఇల్లు నిర్మించాలంటేనే తడిసి మోపెడు కావడం, పైగా ఇసుక దొరకకపోవడంతో పనులు నిలిపివేయాల్సిన దుస్థితి ఏర్పడింది. దీనివల్ల సిమెంట్ గడ్డకట్టడం, ఐరన్ దెబ్బతినడంతోపాటు ఇంటి అద్దెలు చెల్లించాల్సి రావడంతో తీవ్రంగా నష్టపోతున్నామని లబోదిబోమంటున్నారు. గత వేసవిలోనూ ఇసుక విషయంలో అదే పరిస్థితి ఎదురైంది. అయితే ధర ఎక్కువైనా ఇసుక దొరికేది. పేరుకే ఉచిత ఇసుక అయినా ఆన్‌లైన్ బుక్ చేసుకుంటే ఇంటికి ఇసుక చేరుకునేసరికి పాత ధరే పలుకుతోందని పలువురు చెబుతున్నారు. ఇప్పుడు అసలు ఇసుకే బుకింగ్ చేసుకోవడానికి కుదరకపోవడంతో బ్లాక్‌లో గత ధరకన్నా సుమారు 50 శాతం అధిక ధరకు కొనుగోలు చేయాల్సి వస్తుందని బడా నిర్మాణదారులు చెబుతున్నారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలైతే పనులు ఆపేసి ఆన్‌లైన్‌లో ఇసుక బుకింగ్ కోసం కుస్తీ పడుతున్నారు. ఇదే సమయంలో భవన నిర్మాణ కార్మికులు మాత్రం పనుల్లేక అర్థాకలితో అలమటించాల్సిన దుస్థితి ఏర్పడింది. దీనిపై జిల్లాలోని ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు నోరు మెదపకపోవడం గమనార్హం. ఉచిత ఇసుక బుకింగ్ అంటూ హడావుడి చేసిన జిల్లా అధికారులైతే ఇసుక కొరతపై దృష్టి సారించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఏదోక రూపంలో ఇసుకను ప్రజలకు అందుబాటులోకి తీసుకరావాలని, బ్లాక్‌లో విక్రయాలను అరికట్టాలని జనం కోరుతున్నారు.



మద్యం పాలసీ జిల్లాలోని ప్రజాప్రతినిధులకు మంచి కిక్కునిస్తోంది. మద్యం దుకాణాలు ఈ నెల 12 నుంచి ప్రారంభం కానుండగా 11న మద్యం దుకాణాల లాటరీ నిర్వహించి దుకాణదారులను ప్రకటించనున్నారు. ఇంతవరకూ బాగానే ఉంది. అయితే మద్యం దుకాణాలకు టెండర్లు వేసేవారు తొలుత ఆయా ప్రాంత ఎంఎల్ఏల అనుమతి తీసుకుని ఒప్పందం కుదుర్చుకున్నాకే ముందుకెళ్లాల్సిన పరిస్థితి పలు నియోజకవర్గాల్లో కన్పిస్తోంది. ఒకవేళ ఎంఎల్ఏలను సంప్రదించకుండా టెండరు వేస్తే ఆ విషయం తెలుసుకుని సదరు టెండరుదారుడిని వెంటనే ఆయా ఎంఎల్ఏల అనుచరులు పిలిచి హెచ్చరిస్తున్నారు. దీంతో తమకే దుకాణం ఖరారైతే ఎంఎల్ఏకు ఇచ్చే వాటాపై ఒప్పందం కుదుర్చుకోక తప్పని పరిస్థితి. మద్యం దుకాణదారు 50 శాతం వరకూ సొమ్ము ఎంఎల్ఏలకు ముట్టజెప్పాలని ఆయా ఎంఎల్ఏల కుటుంబ సభ్యులు నేరుగా మద్యం దుకాణాల టెండర్లు వేస్తున్నవారికి హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా సాగడంతోపాటు బెల్ట్‌షాపులు యథేచ్ఛగా ప్రారంభమయ్యే అవకాశం ఉందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. దీనిపై అటు ఎక్సైజ్, ఇటు అధికార పార్టీ ప్రజాప్రతినిధులు నోరు మెదిపే పరిస్థితి దాదాపు శూన్యమని వాటాల పంపకం బట్టి అర్థమవుతోంది. అంటే మరికొద్ది రోజుల్లో మందుబాబుల వీరంగం ప్రారంభమవుతుందనే చెప్పొచ్చు. దీనిపై ప్రజల నుంచి సైతం ఆగ్రహజ్వాలలు ఎగిసే అవకాశం ఉంది.

-విఎస్ఎస్‌వి.ప్రసాద్

పెర్కిపాలెంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరవాసరం

యునైటెడ్ కాపు సర్వీస్ క్లబ్ ఆధ్వర్యంలో పెర్కిపాలెంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని మాజీ ఎంఎల్ఏ సిహెచ్.సత్యనారాయణమూర్తి (బాబ్జి) ప్రారంభించారు. హృదయ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రైస్‌మిల్లు అధినేతలు జక్కంపూడి వెంకటరంగారావు, నూకల ధనుంజయ సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కేన్సర్, కళ్లు, దంతాలు, చర్మ వ్యాధులు కలిగిన వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. సర్పంచి కందుల వెంకటేశ్వరరావు, పెనుమాక రామ్మోహనరావు, జక్కంపూడి మదన్, వేరుకొండ దుర్గా ప్రసాద్, సిరిగినీడి నాగార్జున పాల్గొన్నారు.

పెర్కిపాలెంలో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎంఎల్ఏ సిహెచ్ బాబ్జి

మద్యం షాపుల కోసం 21 దరఖాస్తులు

ప్రజాశక్తి - తణుకు రూరల్

మద్యం షాపుల కేటాయింపుల కోసం ఆదివారం నాటికి ఆఫ్‌లైన్ విధానం ద్వారా 21 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ శాఖ తణుకు సిఐ ఎస్.మణికంఠరెడ్డి తెలిపారు. తణుకు సర్కిల్ పరిధిలో తణుకు పట్టణ పరిధిలో తొమ్మిది, తణుకు రూరల్ పరిధిలో ఐదు, ఇరగవరం మండలంలో మూడు, పెనుగొండ మండలంలో తొమ్మిది, పెనుమంట్ర మండలంలో ఆరు షాపులను కలిపి మొత్తం 33 దుకాణాలను నోటిఫై చేశామన్నారు. ఆయా షాపుల పరిధిలో 50 వేలు జనాభా దాటిన ఒక్కో షాపునకు లైసెన్స్ ఫీజు రూ.65 లక్షలు ఏడాదికి చెల్లించాలని, ఈ మొత్తం ఆరు వాయిదాలుగా చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ విధానంలో ధరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఒకో దరఖాస్తు కోసం రూ.2లక్షలు చెల్లించాలని, ఒకవేళ లాటరీలో షాపు రాకపోయినా ఈ ఫీజు తిరిగిరాదన్నారు. ఆశావాహులు ఆధార్, పాన్ కార్డు తమ కార్యాలయంలో నేరుగా వచ్చి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్‌లో ఎంత మంది దరఖాస్తు చేశారన్నది తెలియకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుందన్నారు.

పాలకొల్లు టౌన్ హాలులో లిఫ్ట్ ప్రారంభం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు టౌన్ హాలులో నూతనంగా ఏర్పాటు చేసిన లిఫ్ట్ సౌకర్యాన్ని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ టౌన్ హాల్ అభివృద్ధికి కృషి చేస్తున్న ఛైర్మన్ పోలిశెట్టి రాధాకృష్ణ, పాలకవర్గాన్ని అభినందించారు. క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇచ్చి టోర్నమెంట్స్ నిర్వహించడం పట్ల అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు పెచ్చెట్టి బాబు, జివి, జనసేన నేతలు బోనం చినబాబు, బిజెపి నేతలు కబర్ధి, జక్కంపూడి కుమార్ పాల్గొన్నారు

లిఫ్ట్ ప్రారంభిస్తున్న మంత్రి నిమ్మల

నేరాలు - ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో పాస్టర్ మృతి

ప్రజాశక్తి - ఆచంట

లాజర్ (ఫైల్‌ఫొటో)

మందు బిల్లలు తెచ్చుకుంటానంటూ ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన పాస్టర్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని వల్లూరులో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు వివరాల ప్రకారం... వల్లూరు పంచాయతీ పరిధి మాదాసువారిపాలెం గ్రామానికి చెందిన జిడిఎం చర్చి పాస్టర్ దిగమర్తి లాజర్(49) గత 15 ఏళ్ల నుంచి మాదాసువారిపాలెంలో జిడిఎం చర్చి పాస్టర్‌గా పని చేస్తున్నారు. ఆయనకు భార్య ఒక కుమారుడు ఉన్నారు. ఈ క్రమంలో శనివారం రాత్రి మాధవసవారిపాలెం నుంచి నడుచుకుంటూ వల్లూరు సెంటర్‌కు మందు బిల్లలకు తెచ్చుకోవడానికి వెళ్లి తీసుకుని తిరిగి ఇంటికి బయలుదేరాడు. వల్లూరు-ఇలపర్రు వెళ్లే ఆర్అండ్‌బి రహదారులో వల్లూరు సమీపంలో గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి దిగమర్తి లాజరును ఢీకొట్టింది. తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు ఆయనను అంబులెన్స్‌లో పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం అక్కడి నుంచి తణుకు, రాజమండ్రి తీసుకువెళ్లారు. పరిస్థితి విషమింగా ఉండడంతో మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. పాస్టర్ మృతితో వల్లూరు పంచాయతీ పరిధి మాదాసువారిపాలెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని ఎస్ఐ వెంకటరమణ పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు.


కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న సిపిఎం నేతలు

లాజర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన సిపిఎం నాయకులు

ఆచంట : లాజర్ కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలం అన్నారు. వల్లూరు పంచాయతీ పరిధి మాదాసువారిపాలెంలో దిగమర్తి లాజర్ కుటుంబ సభ్యులను సిపిఎం నాయకులు పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో సాయంత్రం ఆరు గంటల నుంచి యువకులు మోటార్‌సైకిల్‌పై అతివేగంగా వెళ్తూ అమాయకుల ప్రాణాలను బలి తీస్తున్నారన్నారు. దీంతో ఆయా కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే పోలీసులు అతి వేగంగా వెళ్తున్న మోటార్ సైకిల్‌పై నిఘా ఉంచాలన్నారు. దిగమర్తి లాజర్‌ను వెనుక నుంచి ఢీ కొట్టిన గుర్తుతెలియని వాహనాన్ని గుర్తించి ఆ కుటుంబానికి తగిన న్యాయం చేసే నష్టపరిహారం ఇప్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఇందుకూరి సూర్యనారాయణరాజు, సిపిఎం నాయకులు పి.మోహన్‌రావు, బొర్రా ధర్మారావు, ఆకుమర్తి తిరుపతిరావు ఉన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఆర్‌టిసి బస్సు

బస్సు డ్రైవర్ మృతి

10 మందికి స్వల్ప గాయాలు

ప్రజాశక్తి - నరసాపురం

జగన్మోహన్‌రావు (ఫైల్)

అనకాపల్లి జిల్లాలో చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఆర్‌టిసి నరసాపురం డిపోకు చెందిన బస్సు డ్రైవర్ మృతి చెందాడు. అనకాపల్లి జిల్లా కసింకోట మండలం బయ్యవరం జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని నరసాపురం డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు ఢీకొట్టింది. ఆదివారం తెల్లవారుజామున మూడు గంటలకు జరిగిన ఈ ప్రమాదంలో నరసాపురం డిపోకు చెందిన బస్సు డ్రైవర్ గుత్తుల జగన్మోహన్‌రావు (48) మృతి చెందాడు. మరో పది మందికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో బస్సులో 33 మంది ప్రయాణికున్నట్లు ఆర్‌టిసి అధికారులు తెలిపారు. మృతుడు జగన్మోహన్రావు గత 14 ఏళ్లుగా ఆర్‌టిసి బస్సు డ్రైవర్‌గా పని చేస్తున్నారు. మరో గంటలో విశాఖకు చేరే లోపు ప్రమాదం చోటు చేసుకుంది. మృతుడు గుత్తుల జగన్మోహన్‌రావు యలమంచిలి మండలం ఇలపకుర్రు గ్రామానికి చెందినవారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రమాద వార్త తెలియగానే డిపో అధికారులు, కార్మికులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. ఇటు ప్రయాణికుల బంధువులు కూడా ఆందోళన చెందారు. తమ వారి వివరాలను డిపోకొచ్చి అడిగి తెలుసుకున్నారు. స్వల్పగాయాలతో బయటపడ్డారన్న విషయం తెలియగానే ఊపిరి పీల్చుకున్నారు. అసిస్టెంట్ డిపో మేనేజర్ ధనలక్ష్మి, కార్మిక సంఘాల నాయకులు నారాయణ, మూర్తి తదితరులు విశాఖ వెళ్లారు. ఆసుపత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం చేయించి రాత్రికి ఆయన స్వగ్రామానికి తీసుకొచ్చారు. సోమవారం అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99180
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

కాశీపట్నంలో నేడు ఉచిత పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని కాశీపట్నం పడమరలో సోమవారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నామని వైద్యురాలు జి.నీలిమ తెలిపారు. రైతులందరూ తమ పశువులను శిబిరానికి తీసుకొచ్చి వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కల్లుగీత వృత్తికి సమగ్ర చట్టం చేయాలి

కల్లుగీత కార్మిక సంఘం

ప్రజాశక్తి - నరసాపురం

కల్లుగీత వృత్తికి సమగ్ర చట్టం చేయాలని ఎపి కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొక్కా చంటి డిమాండ్ చేశారు. నరసాపురం మీరా స్మారక గ్రంథాలయంలో ఆదివారం ఆ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంటి మాట్లాడుతూ ఈ నెలలో వచ్చే కల్లు గీత పాలసీ కల్లుగీతను రక్షించే విధంగా ఉండాలన్నారు. రాష్ట్రంలో ప్రమాదవశాత్తు మరణించిన కల్లుగీత కార్మికులకు బీమా ప్రమేయం లేకుండా పాత పద్ధతిలోనే గీత గుర్తింపు కార్డు ద్వారా ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ నుంచి తక్షణమే ఇవ్వాలన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు కడలి పాండు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఆ రాష్ట్రంలో ప్రమాదవశాత్తు దెబ్బలు తగిలిన కల్లుగీత కార్మికులకు వైద్య ఖర్చు నిమిత్తం రూ.25 వేలు, దహన సంస్కార ఖర్చుల నిమిత్తం రూ.30 వేలు కూటమి ప్రభుత్వం ఇవ్వాలన్నారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్న 1991 పోరాడి సాధించుకున్న కల్లుగీత కార్పొరేషన్‌ను గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, తిరిగి మళ్లీ కార్పొరేషన్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కల్లుగీత సంఘ నరసాపురం మండలాధ్యక్షులు బొక్క సోమేశ్వరరావు, నాయకులు గుబ్బల వెంకన్న, బండి పోలేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

చేదోడు, తోడు, వాహనమిత్ర పథకాలు తిరిగి ప్రవేశపెట్టాలి

చేతివృత్తుల ఐక్యవేదిక

ప్రజాశక్తి - పెనుమంట్ర

కొత్త ప్రభుత్వంలో వెంటనే చేదోడు, తోడు, వాహనమిత్ర పథకాలను తిరిగి ప్రవేశపెట్టి వారిని ఆదుకోవాలని జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు అల్లడ సూర్యభాస్కరరావు కోరారు. మండలంలోని మార్టేరులో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయీబ్రాహ్మణులు, రజకులు, వివిధ సామాజిక తరగతులకు చెందిన చిరు వ్యాపారులు, ఆటో నడుపుకునే డ్రైవర్లు ఆ పథకాలు వల్ల కొంతమేర లబ్ధి పొందే అవకాశం ఉన్నందున తిరిగి ప్రవేశపెట్టడం ద్వారా వారిని ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే రాష్ట్రంలో కులగణన చేసి కేంద్రంలో ఒబిసి మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, పార్లమెంట్, అసెంబ్లీలలో రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం సంస్థ తరపున రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట ఈ నెల 21న ధర్నా నిర్వహించేందుకు నిర్ణయించామని, ఆ మేరకు జన సమీకరణ చేస్తున్నామని తెలిపారు.

ఖాళీగా కీలక శాఖల పోస్టులు

సేవలందక ప్రజల అవస్థలు

భర్తీ చేయాలని వేడుకోలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలో రెండు ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రధాన పోస్టులు ఖాళీగా ఉన్నాయి. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ పోస్టు గడచిన ఐదు నెలలుగా ఖాళీగా ఉంటుంది. ప్రస్తుతం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ, ఇఒపిఆర్‌డి పోస్టులు రెండూ ఖాళీ అయ్యాయి. గడచిన సాధారణ ఎన్నికలకు ముందు ఇక్కడకు వచ్చిన ఎంపిడిఒ పి.పద్మజ తిరిగి విశాఖపట్నం జిల్లా సబ్బవరం మండలానికి బదిలీ అయ్యారు. ఇక్కడ ఇఒపిఆర్‌డిగా పని చేస్తున్న పివివిఎస్.ప్రసాద్ తణుకు మండల ప్రజా పరిషత్‌కు బదిలీ అయ్యి వెళ్లిపోయారు. కాగా ఇక్కడ అడ్మినిస్ట్రేషన్ అధికారిగా పనిచేసిన పూర్ణ బాబ్జికి ఆకివీడు మండలానికి బదిలీ కాగా వెళ్లిపోయారు. ప్రస్తుతం పెనుగొండ మండలం నుంచి పూర్ణబాబ్జి స్థానంలో ఇఒగా విధుల్లో చేరిన ఇవిఎస్‌వి.శర్మ ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా విధులు నిర్వహిస్తున్నారు. వెంటనే మండలంలో కీలక పోస్టులు రెండింటిలో పూర్తి స్థాయి అధికారులను నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

యుటిఎఫ్ పోటీల్లో బాస్కెట్‌బాల్ జిల్లా జట్టు విజయకేతనం

ప్రజాశక్తి - పెనుమంట్ర

యుటిఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా గుంటూరులో జరిగిన క్రీడాఉపాధ్యాయుల విభాగంలో బాస్కెట్‌బాల్ పోటీల్లో మండలానికి చెందిన పశ్చిమగోదావరి (మార్టేరు) జట్టు విజేతగా నిలిచింది. శనివారం రాత్రి ఈ వేడుకల్లో భాగంగా గుంటూరులో ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహించారు. బాస్కెట్‌బాల్ పోటీల్లో పశ్చిమగోదావరి జిల్లా జట్టు పైనల్లో పల్నాడు జిల్లా జట్టుపై 12-9 స్కోరు తేడాతో విజయం సాధించింది. తద్వారా రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించి, గోల్డ్ మెడల్‌ను సొంతం చేసుకుంది. విజేతలకు పిడిఎఫ్ ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు చేతుల మీదుగా గోల్డ్ మెడల్, సర్టిఫికెట్‌లను అందించారు. జట్టు సభ్యులకు పెనుమంట్ర ఎంఇఒ-1 వై.లక్ష్మీ నారాయణ, ఎంఇఒ-2 యు.నాగేశ్వరరావు, యుటిఎఫ్ మండల నాయకులు, క్రీడోపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

లక్ష్మణరావు చేతులమీదుగా గోల్డ్‌మెడల్ అందుకుంటున్న విజేతలు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఉపాధ్యాయులకు సత్కారం

ప్రజాశక్తి - కాళ్ల

ఉపాధ్యాయ వృత్తిని మించింది లేదని రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు రామకృష్ణంరాజు అన్నారు. మండలంలోని జువ్వలపాలెం గ్రామంలో గోకరాజు రంగరాజు ఉన్నత పాఠశాల 2007-08, పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళాన్ని ఆదివారం నిర్వహించారు. వారందరు 17 ఏళ్ల క్రితం ఆ పాఠశాలలో చదువుకున్నవారు. అందరూ వివాహాలు చేసుకుని వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డవారు. పాత జ్ఞాపకాలను ఒక్కసారి గుర్తుచేసుకొని పూర్వ విద్యార్థులు ఒక్కచోటకు చేరుకున్నారు. చిన్ననాటి మధుర జ్ఞాపకాలను మనసారా గుర్తుకుతెచ్చుకొని ఆనందపడ్డారు. అప్పుడు చదువుచెప్పిన ఉపాధ్యాయులు శ్రీనివాసరాజు, వరలక్ష్మి, పుష్పలత, సీతాదేవి, జ్యోతిలను శాలువ, పూలమాలలతో సత్కరించి నూతన వస్త్రాలు అందించారు. ఈ సమావేశంలో వివిధ ప్రాంతాల్లో ఉంటున్న అందరూ కలుసుకుని కబుర్లు చెప్పుకున్నారు. ఒకరి గురించి ఒకరు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రాజేష్, రాంబాబు, గణేష్, శంకర్, సంధ్య, కనకమాలక్ష్మి, కమల, అనురాధ పాల్గొన్నారు.

2007-08, పదో తరగతి పూర్వ విద్యార్థులు

అడ్డాల చంటికి వైసిపి నేతల పరామర్శ

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లుకు చెందిన సినీ నిర్మాత అడ్డాల చంటి తల్లి ఇటీవల మృతి చెందారు. ఆదివారం ఆయన కుటుంబాన్ని వైసిపి నేతలు పరామర్శించారు. చంటి సోదరులు నారయ్య, దాసు, రాంబాబులను కూడా కలిపి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపీ, డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ, పెచ్చెట్టి కృష్ణాజీ, పాలపర్తి కృపానందం పాల్గొన్నారు.


చంటిని పరామర్శిస్తున్న వైసిపి నేతలు

వృద్ధులు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

నరసాపురం సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రంగారావు

ప్రజాశక్తి - నరసాపురం

మాట్లాడుతున్న అందే రంగారావు

వృద్ధుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని నరసాపురం సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు అందే రంగారావు అన్నారు. స్థానిక శ్రీ అల్లూరి సంస్కృతి కేంద్రంలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవ వారోత్సవాలు సందర్భంగా సుమారు 50 మంది వృద్ధులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో అందే రంగారావు మాట్లాడుతూ ఉపాధి వేటలో యువత నగరాలకు వలస పోతోందని, మెరుగైన జీవితం కోసం మరికొందరు విదేశాలకు వెళ్తున్నారని, ఫలితంగా వృద్ధులైన తల్లిదండ్రులు ఇంట్లో ఒంటరి వారవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తనయులు దగ్గర లేక వారిలో మానసిక, ఆర్థిక సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. కొంతమంది తనయులు దగ్గర ఉన్నా తల్లిదండ్రులను చూడడంలేదని, ఇది బాధాకరమని చెప్పారు. ఎవరైనా తనయులు చూడకపోతే ఒక తెల్ల కాగితం మీద తమకు ఉన్న బాధలను, సమస్యలను రాని స్థానిక తహశీల్దారు కార్యాలయంలో గాని, ఆర్‌డిఒ కార్యాలయంలో గాని అందించి ఒక కాపీని సీనియర్ సిటిజన్ వెల్ఫేరు అసోసియేషన్‌కి అందించాలన్నారు. వెంటనే ఉభయులను సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ కోర్టుకు పిలిపించి పరిష్కరించి బాధిత వృద్ధులకు న్యాయం చేస్తామన్నారు. అర్హులైన వృద్ధులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం పథకాలను వచ్చేలా విద్యావేత్తలైన వృద్ధులు సహాయ, సహకారాలు అందించాలని అందే రంగారావు కోరారు. విశిష్ట సేవలందించిన ఎనిమిది మంది వృద్ధులకు సన్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ సిఐ బి.యాదగిరి, విశిష్ట అతిథులు డాక్టర్ చినమిల్లి సత్యనారాయణరావు, బండారు ప్రతాప్ నాయుడు, వయోవృద్ధుల సంక్షేమ అప్పిలేటు ట్రిబ్యునల్ సభ్యులు మేళం దుర్గాప్రసాద్, కార్యదర్శి షేక్ శిలార్ సాహెబ్, డాక్టర్ జి.జేసుప్రసాద్‌బాబు, సన్మాన గ్రహీతలు డాక్టర్ ఐ.సూర్యనారాయణ రాజు, కె.గంగాధరరావు, కెఎస్.సరస్వతిరావు, ఎక్కువ స్థాయిలో వయోవృద్ధులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల కేటాయింపుల్లో వైసిపి నేతల అక్రమాలు

కొడమంచిలి మాజీ సర్పంచి సత్యనారాయణమూర్తి

గ్రామంలో లే అవుట్ పరిశీలన

ప్రజాశక్తి - ఆచంట

గత ఐదేళ్ల పాలనలో వైసిపి నేతలు అనేక అక్రమాలు చేశారంటూ కొడమంచిలి గ్రామానికి చెందిన మాజీ సర్పంచి చిలుకూరి వీర వెంకట సత్యనారాయణ మూర్తి అన్నారు. అధికారులతో కలిసి ఆయన లే అవుట్‌లను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల కాలంలో కొడమంచిలి గ్రామంలో లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల కేటాయింపుల్లో భారీ అక్రమాల వెలుగుచూస్తున్నాయన్నారు. లబ్ధిదారులకు ఇచ్చిన ఒరిజినల్ ఇంటి పట్టాల్లో తహశీల్దార్ సంతకాలు లేకుండా ఫేక్ ఎంజాయిమెంట్ సర్టిఫికెట్లు ఇచ్చి మోసం చేశారన్నారు. ఈ విషయంపై ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ ఆదేశాల మేరకు రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టామన్నారు. గ్రామస్థాయి ఉద్యోగులు తమ వద్ద ఉన్న జాబితాకు అనుగుణంగా పరిశీలన చేపట్టామన్నారు. ఇందులో భాగంగా సుమారు 60 పట్టాలకు పైగా మండల రెవెన్యూ అధికారి సంతకం లేనట్లుగా గుర్తించినట్లు ఆయన తెలిపారు. ఈ పట్టాలు పొందినవాళ్లు అధిక శాతం పేదలే ఉన్నారని, వారికి కేటాయించిన స్థలాల్లో కొందరు ఇళ్లలు నిర్మించుకున్నారని ఆయన తెలిపారు. కొడమంచిలి పంచాయతీ పరిధిలో కొడమంచిలి పెద్దపేట, టిమేరక, చిన్న పేటలో సుమారు 319 మందికి పట్టాలు ఇవ్వగా వీటిలో 60కి పైగా బోగస్ పట్టాలు ఉన్నట్లు అంచనా వేస్తున్నామన్నారు. డిజిటలేజేషన్ చేసి పుస్తకం రూపంలో ఇచ్చిన కొన్నిటిల్లో పేర్లు మార్పు చేసి ఇచ్చినట్లుగా గుర్తించారన్నారు. ప్రజా అవసరాల కోసం కేటాయించిన స్థలంలోనూ లబ్ధిదారులు పట్టాలు పొంది ఇళ్ల నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. మరో రెండు రోజుల్లో పూర్తి లెక్కలు తేలుతాయని అధికారులు చెబుతున్నారు. ఇళ్ల స్థలాల కోసం సొమ్ములు చెల్లించిన తమకు ఎటువంటి స్థలం చూపలేదని లబ్ధిదారులు అధికారులు, కూటమి నాయకుల వద్ద వాపోతున్నారు.


లే అవుట్‌ను పరిశీలిస్తున్న మాజీ సర్పంచి, కూటమి నాయకులు

కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క, తూడు

చిక్కుకున్న జంతు వ్యర్థాలతో దుర్గంధం

ఇబ్బందుల్లో స్థానికులు

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఏలూరు కాలువలో నారాయణపురం వంతెన వద్ద గుర్రపుడెక్క, తూడు పేరుకుపోయింది. దీంతో నీటి ప్రవాహానికి ఇబ్బందులు ఏర్పడి ఎగువ ప్రాంతాల నుంచి జంతు కళేబరాలు కొట్టుకువచ్చి ఇక్కడ తూడులో చిక్కుకుపోవడంతో దుర్వాసనతో వాంతులు అయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాలువ గట్టు నివాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుళ్లిపోయిన జంతు వ్యర్థాలతో భరించలేని విధంగా దుర్గంధంతో కూడిన వాసనతో వ్యాధుల బారిన పడాల్సి వస్తోందని అభయాంజనేయస్వామి ఆలయ నిర్వాపకులు బొబ్బిలి వెంకటరత్నం, నారాయణపురం వర్తక సంఘం సభ్యుడు చెన్నంశెట్టి చంద్రశేఖర్‌లు ఫిర్యాదు చేశారు. తూడును తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఏలూరు కాలువలో నారాయణపురం వద్ద ఆగిపోయిన తూడు

ప్రజల రక్షణే మా బాధ్యత

ఎస్ఐ మణికుమార్

ప్రజాశక్తి - గణపవరం

మండలంలో ప్రజల రక్షణే తమ భాధ్యత అని గణపవరం ఎస్ఐ ఎం.మణికుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. దసరా, దీపావళి, పండుగల సందర్భంగా ఊరు వెళ్లే పరిస్థితుల్లో స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందిస్తే రాత్రి సమయంలో వారి ఇంటిని పరిశీలనలో ఉంచుతామని చెప్పారు. లాక్‌డ్ హౌస్ మానిటరింగ్ సిస్టంను వినియోగించుకుని తాళం వేసిన ఇళ్లలో దొంగతనాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి ఇంటికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సీసీ కెమెరా లింకులు ఏలూరు కంట్రోల్ రూమ్ 8332959175కి అందించాలని చెప్పారు. ఇంట్లో ఖరీదైన వస్తువులు బంగారం బ్యాంకు లాకర్‌లో భద్రపరుచుకోవాలని సూచించారు. ఎవరైనా అపరిచితులు కనిపిస్తే 112 డయల్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. సెల్‌ఫోనుల్లో వచ్చే మెసెజ్‌ల్లో బ్లూ కలర్ లింకులు ఓపెన్ చేయవద్దని చెప్పారు. సైబర్ నేరానికి గురైనవారు 1930 కాల్ చేస్తే పోలీసులు సహకారం అందిస్తారని తెలిపారు.

కనకదుర్గమ్మను దర్శించుకున్న మంత్రి నిమ్మల

ప్రజాశక్తి - పాలకొల్లు

దేవీ నవరాత్రుల సందర్భంగా పాలకొల్లు యడ్లబజార్‌లో ఉన్న కనకదుర్గమ్మను మంత్రి నిమ్మల రామానాయుడు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మంత్రి చేతుల మీదుగా ప్రసాదాలు పంపిణీ చేశారు. ప్రతి రోజు ఒక్కొక్క అలంకరణతో అమ్మవారిని గత కొన్ని సంవత్సరాలుగా అలంకారం చేయడం పట్ల మంత్రి నిర్వాహకులను అభినందించారు

యాత్రికులతో ముత్యాలమ్మ ఆలయం రద్దీ

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో ఉన్న బండి ముత్యాలమ్మ ఆలయం ఆదివారం యాత్రికులతో కళకళలాడింది. శరన్నవరాత్రులు పురస్కరించుకుని అమ్మవారిని లలితా త్రిపుర సుందరీ దేవిగా అలంకరించారు. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో పాలకొల్లుకు చెందిన బొక్క వీరవెంకట సత్యనారాయణ, భాగ్య పద్మావతి దంపతులు హోమం నిర్వహించారు. బండి ముత్యాల భజన సంఘం ఆధ్వర్యంలో ఆలపించిన భక్తి గీతాలు యాత్రికులను ఆకట్టుకున్నాయి. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కార్యనిర్వాహణాధికారి మోకా అరుణ్‌కుమార్, ఛైర్మన్ కడలి మాణిక్యాలరావు పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది పాలకవర్గ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రసాద వితరణ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

ఘనంగా శరన్నవరాత్రుల మహోత్సవాలు

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని కాళ్లకూరు గ్రామంలో స్వయంభూ శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆదివారం శ్రీలక్ష్మీ శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు ఆదివారం అమ్మవారికి సంతానలక్ష్మి అలంకరణ నిర్వహించారు. తాడినాడకు చెందిన నంబూరి గజపతిరాజు, వాణి దంపతుల ఆర్థిక సహకారంతో సంతానలక్ష్మి అమ్మవారి అలంకరణ నిర్వహించారు. యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం.అరుణ్‌కుమార్, సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు.

ఘనంగా గ్రామోత్సవం

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని కోమటిగుంటలో దసరా ఉత్సవాల్లో భాగంగా కనకదుర్గమ్మ ఆలయంలో రామాలయం కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా దసరా బోనాల సంబరాన్ని ఆదివారం నిర్వహించారు. మహాలక్ష్మీదేవిని దర్శించుకునేందుకు కోమటిగుంటలో యాత్రికులు పోటెత్తారు. బోనాలు నిర్వహించే దాతలు కోలనపల్లి గ్రామానికి చెందిన కూనాధరాజు శివకుమార్‌వర్మ -విజయ లక్ష్మి దంపతులు, కూనాధరాజు రిత్విక్ వర్మ-గాయత్రి దంపతులు, కూనాధరాజు రిషాంక్ ఈశ్వర్ వర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు యలమంచిలి వెంకటరమణ, యలమంచిలి రామాంజనేయులు, గుర్రం వెంకట సత్యనారాయణ, యలమంచిలి బాబ్జి, కాపుశెట్టి సత్యనారాయణ, మంతెన నాగ ఆంజనేయులు, పులమంతుల ఏసురాజు, యలమంచిలి గణపతి, యలమంచిలి శ్రీనివాస్ పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, GADIRAJU. VENKATA SEETA RAMA KRISHNAM RAJU (New Name) S/o Gadiraju Surpa Raju Previously called GADIRAJU. RAMA KRISHNAM RAJU, Resident of Flat No.301, Sainadh Appartment, Steamer Road, Near Tailor High School, Narasapuram, West Godavari District, Andhra Pradesh, Pin code.534275, stating that, now changed my name from GADIRAJU. RAMA KRISHNAM RAJU (Old Name) to GADIRAJU. VENKATA SEETA RAMA KRISHNAM RAJU (New Name).
Today onwards all my documents (Passport etc.,) and correspondence will continue with my new name GADIRAJU. VENKATA SEETA RAMA KRISHNAM RAJU